# మనస్తత్వము

" శివం "

జాతీయ రచనామండలి

విశ్వనాథము పనిచేసే ఆఫీసు కిటికీలోనుంచి చూస్తే ఎదురుగావున్న బజారులో జరిగే అనేక విషయాలు కండ్ల పడుతూంటాయి. ఆదివారము (యిప్పుడు ఆదివారమునాడు బజారు వుండటము లేదు కాబోలు) నాడు మాత్రము భరింపరాని దృశ్యాలు అగుపించవచ్చును. అటువంటప్పుడు బయటకు చూడటము మానివేయొచ్చు.. బలవంత మేమాత్రమూ లేదు.

ఎట్లాగయినాగాని, కిటికీగుండా బయట జరుగుతున్న విషయాలను చూచి ఆనందించే అవకాశము మాత్రము—విశ్వానికి చాలాస్వల్పము. ఎందుకంటే విశ్వనాథానికి ఎదురుగానే—అంటే కిటికీకి అడ్డముగా, హెడ్డు గుమాస్తా నారాయణయ్యరు కూర్చుని వుండేది. తను స్టేటుమెంట్లు వేసుకుంటానో, లేక ఏ డ్రాఫ్టు అయినా గాని వ్రాయడము పూర్తి అయినానో, లేక కాస్త నడుము నొప్పిపట్టి అయినానో, కాగితముల పయినుంచి తలను ఎత్తే సరికి...తనకు ఆ Distempered గోడ మీది విచిత్రమయిన పచ్చటి చుక్కలు. సరిగ్గా కళ్ళ ఎదుట పడుతూంటాయి. తర్వాత హెడ్డు గుమాస్తా ముఖము .

సంవత్సరము క్రితము విశ్వనాథము యీ ఆఫీసులో గుమాస్తాగా ప్రవేశించే సరికి . అతనిని అమితముగా ఆకర్షించిన మొట్టమొదటి విషయము...ఆ గోడమీది చక్కని రంగులు...చుక్కలూను. వాటిని చూచి అతను మహా మురిసి పోయేవాడు. క్రొత్తలో మొదట్లో తను కొంచెము సోమరిగా...వుండేవాడు—ఆ మాటను తను కాదనలేడు కూడాను. ఇంటివద్ద అందరూ తనని 'యద్దేవ' చేసేవారు...దేవలోకమునూ, వెన్నెల రాత్రులనూ, గభీర సముద్రములనూ...గురించి వ్రాయబడిన కవిత్వమంటే చెవి కోసుకునే వాడని. తన వంటి బద్ధకస్తుడూ...సోమరి వ్యక్తి వూహాలోకాల్లో విసుగు లేకుండా ఎట్లా సంచరించగలిగే వాడో ..ఎవ్వరూ చెప్పలేరేమొ? గడ్డిపోచంత పటుత్వమున్న విషయము చాలు . అతనిని వూహాలోకాలలో... సంచారానికి మేల్కొల్పడానికి. ఉదాహరణము ఆ మూడు మచ్చలు! అద్భుతమయిన మూడు ద్వీపాలవి. ఆ ద్వీపాల మధ్యనుండి తనొక్కడూ తన బుల్లిపడవతో.. ఆవలించే ఆ విశాల నీలాకాశము క్రింద ఎన్నిమార్లు ప్రయాణము చేసేడు. ఎంత ఆనందమును అనుభవించ గలిగేడు ..ఆ విహారాలవల్ల. తను వుద్యోగానికి వచ్చిన తర్వాత మారిన పంకాలాగే కుర్రాళ్ళలో మూడో వాడు, చిత్రకళలో తనకూ ప్రవేశమున్నదనే విషయాన్ని నిరూపిస్తూ.. ఆ మూడు ద్వీపాలనూ ..ఎర్రసిరాతో అంచులు దిద్ది మానవాకృతులుగా ..పిలకలతో తయారు చేసేడు...ఎవ్వరూ లేని సమయాన. తను చిన్న తనములో, చంద్రునిలోని 'ముసలమ్మ'ను చూడటానికి ఎంతగా అసహ్యించుకునేవాడో... యీ నాడు తన ద్వీపాలలోని మానవాకృతులను చూడటానికి అంతకంటె మిన్నగా బాధపడుతున్నాడు.

కాని యీ మధ్య...వూహాలోకాలలోనికి తన ధీర కృత్యాలపయి మోజు తనకే క్రమముగా చల్లబడి పోయినది. ఇది వరకులాగ ప్రతీరాత్రీ నిద్రలో . ఏదో పక నదీ ప్రవాహము వెంటనో,...కొండల వెంబడో, వంటరిగా విహరించడము మానివేసినాడు. క్లబ్బులో చేరిన తర్వాత, అతని పగటి కలలు పట్టణానికి బయటనే వున్న కొండలవయిపూ ...గుట్టలవయిపూ, పరిసర ప్రాంతాలలో నివసిస్తూన్న కొండజాతి ప్రజలవయిపూ మరల సాగినవంటే అసత్యము కాదు. నిస్సహాయుడిలా వంటరిగా తిరుగక—మూర్తి, శర్మ, శ్యామల, లక్ష్మి, రాజ్యం (క్లబ్బు స్నేహితులు) మొదలయిన మిత్రబృందముతో ఆడుతూ పాడుతూ కొండలు ప్రతిధ్వనించేట్లు నవ్వుకుంటూ .. మైళ్ళకొలది . తిరుగ సాగేడు...వూహాలోకాల్లోనే.

యీ సారి నాన్నగారు, తనని "స్త్రీలతో కలసి విచ్చల విడిగా తిరుగుతున్నావనీ, వాళ్ళుకూడా వెళ్ళే క్లబ్బులో నే మెంబరుగా చేరేవనీ" అడగక పోవడము కొంతవరకూ సుగుణమే. క్రిందటి సారి చెల్లెలు మగవాళ్ళ Tennis Club లో (స్త్రీలకూ, పురుషులకూ అదే) చేరతానంటే ఎంత రభస జరిగింది ?

విశ్వనాథము యిప్పుడు తీరికగా కూచుని విచారిస్తున్నాడు. 'తను రెండు నెలల క్రితము రెండు దినాల సెలవు తీసుకొని గుంటూరు ఎందుకు వెళ్ళినానా' అని. తన క్లబ్బులోని మిత్రులంతా—శ్యామలకూడాను—రేపు నాగార్జున కొండకు ప్రయాణము అవుతున్నారు. తను ఎన్ని దినాల నుంచో కలలు గనే విషయము రేపు కార్యరూపము దాలుస్తూంది...తీరాచేసి, తనకు సెలవ దొరుకుతుందా...దొరకదా...అనేదే ప్రస్తుతము ఆలోచించవలసిన విషయము.

*   *   *

"దయయుంచి...ఒకసారి 'లీవురిజిష్టరు' చూడనిస్తారా ? సార్."

"ఆరు, నాలుగు కలిపితే పది, రెండు ..పన్నెండు, ఏడు...పంథొమ్మిది, పన్నెండు పోతే...ఏడు పైసలు, అణాలు ఒకటి, ఒకటీను పదమూడు . పధ్నాలుగు, ఆరు వందల యాభయ్యీను...ముఫ్ఫయిఆరు, ఆరువందలఎనభయి ఆరు అన్నమాట. మొత్తము 686-14-7. 'కరక్టు' . నేను మీకు అనేక పర్యాయములు చెప్పినా...పని చేసుకుంటూండగా మాట్లాడించ వద్దని. ఏమి లాభం...నా నోరు అరిగి పోవడమేకాని...మీరు వినరుకదా..."అన్నాడు అయ్యరు పుస్తకాలపయినుంచి తలఎత్తి, కళ్ల జోడుపయినుంచి విశ్వనాధాన్ని చురచుర చూస్తూ.

"తప్పిదానికి క్షమిస్తా రనుకుంటూ. లీవు రిజిష్టరు వకసారి యిస్తారా...చూసుకొని యిచ్చేస్తాను."

"లీవు రిజిష్టరా ?" మనీపర్సును వకసారి యిస్తారా .. అని అడిగినంత ఆశ్చర్యాన్నే పొందేడు నారాయణయ్యరు.

"అవును సర్, లీవు రిజిష్టరు. మనము వాడుకున్న సెలవలు note చేయబడి వుండే రిజిష్టరు" అన్నాడు విశ్వం .. విపులీకరిస్తూ.

"ఒహ్హో ! లీవు రిజిష్టరా ? అదయితే...ఆఫీసరుగారి డ్రాయరులో వుంది. అయినా దానితో ఏమి పని మీకు ?"

"నాకు యింకేమయినా సెలవ మిగిలి వున్నదేమో... చూచుకుందామని ..సర్."

వక్కసారి 'డ్రే' లోని గుండుసూదులు...పాళీలు తలక్రిందులు అయినట్లే ... వినవచ్చింది హెడ్డుగుమాస్తా నవ్వు.

మీకు మిగిలివున్న సెలవలు...ఏమిటో వాడుకున్న సెలవలు ఏమిటో మీకే తెలియవుటండీ ! అయితే నేను చెబుతాను వినండి. మీకు వున్న సెలవులన్నీ యిదివరకే వాడేసేరు...బాబూ !"

"లేదు సార్. ఇంకా రెండు దినాలు మిగిలి వున్నట్లుగ నాకు జ్ఞాపకము వుంది ."

"జూలై నెల మొదట్లో రెండు దినాలు వాడేయటము గుర్తుకు రావటంలే.. అన్నాడు అయ్యరుగారు చిరాకు పడుతూ.

"అది సరే సార్. విక్టరీ సెలవల్లో...యింకా వకటి రెండు దినాలు వుండాలి..."

"లేదు. అవ్వీ వాడేసేరు. సరిగ్గా monthly returns పంపబోయేముందు సెలవు పెట్టేరు...గుర్తు లేదూ మేమంతా...ఆ స్టేటుమెంట్లు అగుపించక తన్నుకున్నాము కూడాను .."

ఇంతలో జవాను వెంకన్న...తలుపు వెనుకనుంచి కాఫీ తెచ్చినట్లు సంజ్ఞ చేయడమూ...,అయ్యర్ గారు 'వక్కక్షణమయినా సరిగ్గా పని చేసుకోనీయరు గదా" అని నసుగుతూనే లేచి బయటకు జారడమూ...విశ్వనాధము కిటికీవద్దకు అడుగులు లెక్క పెట్టుకుంటూ నడవటము జరిగేయి.

చుట్టూవున్న పెద్ద భవనాలు...ఆఫీసును చూచి యీసడిస్తూన్నాయి. కిటికీ గుండా అగుపించే వక మేడమీద నుండి త్రివర్ణ పతాక మొకటి...తెల తెలబోయే ఆకాశములో స్వేచ్ఛగా ఎగురుతూంది. బానిసత్వాన్ని బెదిరి

స్తూన్న పతాకమును పక్షులు రెండు వకదాని నొకటి తరుముకుంటూ చేరబోవడము...క్రిందటి వారము తను సినిమాలో చూచిన News Reel లోని విమాన యుద్ధమును స్మృతికి తెచ్చినది...విశ్వానికి. ఇదే మాదిరిగా వకదాని నొకటి తరుముకోగా... వక విమానము...అకస్మాత్తుగ చెడిపోయి సముద్రములో పడి మునిగిపోతుంది. దూరాన పోతూన్న మిత్ర నొక...యిది చూచి... విచార చిహ్నముగా... పతాకమును ఎగుర వేస్తుంది.

తామంతా యీ బానిసత్వములో పడి మునిగి పోగా, ఆకాశాన్నంటుకునే సౌధమునుంచి ఎగిరే ఆ పతాకము .. తమ విషాద జీవితానికి స్మృతి చిహ్నముకాదు గదా...? స్వాతంత్ర్యాన్ని ..యిష్టా అయిష్టతలను మరచి, కాగితాలే ప్రపంచమనుకుని జీవిస్తూన్న తమ వంటి గుమాస్తాల చరిత్రను, అల్లంత ఎత్తునుండి విచిత్రమయిన భాషలో యితర ప్రజానీకానికి ఎలుగెత్తి చెబుతున్నదా...ఆ పతాకము! లేక పోతే ఆ 'టప టప' మనే విచిత్రమయిన భాష ఏమిటి?

తన ప్రక్కను కూర్చునే గుమాస్తా సుబ్బారావు... పెన్సిలు కోసము మూడవ సారి పిలవడముతోనే ..వూహాలన్నీ బ్లాటింగులో అద్దేసినట్టే అయిపోగా... టేబిలువద్దకు వచ్చి కూర్చున్నాడు విశ్వనాధము.

శనివారమునుంచి సోమవారము సాయంత్రము వరకు తామంతా కలసి నాగార్జున కొండలలో కాలాన్ని గడప బోయేది, మొత్తము మూడు దినాలు. ఆదివారము మామూలుగ సెలవు దినమే. అంటే పదకొండు గంటలకే ఆఫీసు కొచ్చి...సాయంత్రము ఆరు గంటల కల్లా యింటికి వెళ్ళిపోవచ్చును! ఇక ..శనివారము, సోమవారము సెలవు పెట్టాలి. రెండు దినాలు సెలవు కనుక మిగిలి వుంటే ఎంత బాగుండును!

లీవు రిజిష్టరును గురించి హెడ్డుగుమాస్తా అబద్ధమాడటము లేదూ? సాధారణముగా అది ఎప్పుడూ నారాయణయ్యరుగారి 'అల్మయిరా' లోనే వుంటుంది. ఏ కారణము చేతనో గాని...ఆయనకు ఆ రిజిష్టరు తన కండ్లబడ నివ్వటము యిష్టము లేదు. కానీయి, ఎందుకు కనపడదో చూద్దాము...అని అనుకుంటూనే విశ్వనాధము లేచి అయ్యరు గారి అల్మయిరాను చేరబోయే సరికి మేడమెట్లమీద శబ్దము వినరాగానే...ఖంగారు ఖంగారుగా...విశ్వనాధము తన టేబిలును చేరి...పనిలో నిమగ్నుడయి పోయినట్లు నటించ సాగేడు. ఖంగారులో స్టేటుమెంట్లలో వకచోట 7000 కు బదులు 700 కూడా వేయ సాగేడు. మధ్యాహ్నము నాలుగు గంటలకు ..అయ్యంగారు టిఫినుకు లేచే వరకు గాని—తనకు అల్మయిరా తెరిచే అదనే చిక్కలేదు.

లీవు రిజిష్టరు 'అల్మయిరా' లోనే వున్నది. తను వాడిన సెలవు దినాలన్నీ అతిజాగ్రత్తగా అందులో గుర్తించబడి వున్నాయికూడాను. సెప్టెంబరులో రెండు విక్టరీ దినాలూ వాడేసేడు. పోగా యింక వక్క సెలవు దినము తనకి మిగిలివున్నదన్న మాట.

రేసుకోర్సులో ఎక్కువగా అగుపించే ముఖాల వంటి ముఖముతో, విశ్వనాధము నీరసించి పోయి ..కుర్చీలో జేర్లబడి పోయేడు. సెలవులన్నీ వాడేసినట్లు తనకీ తెలుసును గాని...తన యిష్టదైవ మెవ్వరయినా తనని కటాక్షించి... వాడుకున్న దినాలన్నీ చెరిగిపోయేట్లు చేయడమో లేక మరొక విధముగానో...తనకు వుపకారము చేయడము జరుగుతుందని...పిచ్చి భ్రమపడ్డాడు. కాని అటువంటి మంచి పని లేమీ జరుగ లేదు...యిక్కడ.

అయితే ఇక తనకు మిగిలి వున్నది వక్కదినము... సెలవే. మరొక రోజు Special leave అడిగితే...దొర దయతలచి యివ్వవచ్చు. తను నారాయణయ్యరును పట్టుకు ప్రాకులాడితే లాభము ఏ మాత్రమూ లేదు. తిన్నగా దొర వద్దకే వెడితే బాగుంటుంది.

దొరను చూస్తే... తనకు జమిందారుగారి నల్లటి 'జాగిలము' గుర్తు కొస్తూంటుంది. అంతటి శుభ్రత తెలివి, చలాకీ, పట్టుదల...దొరలోకూడ పేరుకు కూచున్నాయి.

దొరచేత సంతకాలను చేయించడానికి నాలుగు స్టేటు మెంట్లను 'pad' లో కట్టుకొని విశ్వనాధము దొర గది లోకి నడిచేడు.

SPARKS దొర విశ్వనాధాన్ని చూస్తూ చిరునవ్వొకటివదుల్తూ...తన ఎదుటనే వున్న విశ్వనాధము దస్తూరీతో

వున్న వక వుత్తరాన్ని చూపుతూ అన్నాడు "నీ దస్తూరీ చదువుతుంటేనే ఆనందముగా వుంటుందోయి. నీ వంటి దస్తూరీ మన మిగతా గుమాస్తా లందరికీ వుంటే చాలా బాగుండును. అన్నట్లు .. యెప్పుడూ పని తేలికగా వుంటూందా ?"

"చిత్తము. తేలికగానే వుంటూంది తమ దయవల్ల."

"మంచిది. మనస్సును పని మీద లగ్నము చేస్తే... కష్టమయిన పనయినా తేలికగా వుంటుంది సుమా. ఇందులో పెద్ద తెలివి తేటలు అక్కరలే."

"చిత్తం. నాకు మీ రిచ్చిన పని చాలా సరదా అయిన పని కూడాను."

సంభాషణ చాలా సాఫీగా, అనుకూలముగా, నడుస్తూంది. తను Speciał leave అడగటానికి యిదే చక్కని సమయము కూడాను. ఆఫీసరు డ్రాయరుమీద వున్న "Do it now" అనే మాట్లోవైపే చూస్తూ నాలుకను తడుపుకోసాగేడు విశ్వనాథము.

"ఆ సుబ్బారావుకు పనంటే వట్టి ఏడుపోయి. పైగా తన పని చాలా కష్టమంటాడు. పని ఎందుకు కష్టముగా వుంటుంది? మనస్సును పనిమీద ..లగ్నము చేయకపోవడం వల్లనేఅతను 'ఎప్పుడు శనివారం వస్తుందా...ఎప్పుడు ఆదివారము ఆఫీసు ఎగకొడదామా...ఎప్పుడు సెలవు పెడదామా.' అనే ఎప్పుడూ ఆలోచిస్తూంటాడు. ఇదేనా పైకి వచ్చే లక్షణము ?"

"కాదు సార్."

"నీవు కనక యిదేమాదిరిగా...ఉత్సాహముగా, పట్టుదలగా పని చేస్తే ఏడెనిమిది ఏండ్లలో హెడ్డుగుమాస్తావు అయ్యి తీరుతావు...మంచిది. నీకు ఏం కావాలి .."

విశ్వం గుండెలు దడదడా కొట్టుకున్నాయి. ఇప్పుడు కనుక సెలవు అడిగితే ఎనిమిదేళ్ళకు రాబోయే హెడ్డు గుమాస్తా పని పోతూన్నట్లే అనిపించగా...వుక్కిరి బిక్కిరి అవుతూ. "సంతకాలకు స్టేటుమెంట్లు సర్" అని అనగలిగేడు.

సంతకాలయిన స్టేటుమెంట్లుతో బయటుపడ్డ విశ్వానికి... Distempered గోడమీది చుక్కలన్నీ త్రివర్ణ పతాకాల లా అగుపిస్తూ...టప టప లాడుతూ...సందేశాల నిస్తూ బానిసల మనస్తత్వాన్ని హేళనచేస్తూన్నట్లు అగుపించసాగేసరికి క్రుంగిపోయాడు కుర్చీలో.

★


# SCABIOL

**SOVEREIGN REMEDY FOR ALL SKIN DISEASES**

గజ్జి, వేడికురుపులు, మొటిమలు, తామర మొదలగు చర్మవ్యాధులకు

## స్కేబియాల్

సాటిలేని మందు.

Agents for Andhra Desa C P Tham & co, Cocanada; for Travancore & Cochin States Chandy & co, Trichur, for Palghat N. L. Parasurama Iyer, (Mamakutty), Palghat.

*Manufacturers*

**THE MADURA COTTAGE INDUSTRIES,**

MANUFACTURERS & REPRESENTATIVES

**17, PERUMAL TANK STREET, MADURA.**